సీఎం రాజీనామా చేయాలి : ప్రహ్లాద్‌జోషి

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య పొట్టేలో, పులో, సింహమో ఏదైనా గానీ తొలుత నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి డిమాండ్ చేశారు. ముడా వివాదంలో సీఎం భయపడేది లేదని, ఆయన ఒక పులి అని మంత్రి జమీర్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం హుబ్బళ్లిలో కేంద్రమంత్రి స్పందించారు. కోర్టుకు వెళ్లడం ద్వారా గవర్నర్‌ను బెదిరించాలని యత్నించారని ఆరోపించారు. త మ ప్రశ్నలకు సీఎం, కాంగ్రెస్ సమాధానం చెప్పడం లేదన్నారు. దేవరాజ్ అరసును తొలగించింది ఇందిరాగాంధీ అని తెలుసుకోవాలన్నారు.

నవశకం వేదికపై ప్రముఖులు



ప్రగతి వైపు ఆంధ్ర

● కక్ష సాధింపులు పోయాయి ● కార్యకర్తలకు బెంగళూరు టీడీపీ ఫోరం ఆదర్శం ● నవశకం సభలో ఏపీ మంత్రి సవితమ్మ

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో కక్ష సాధింపులు కొనసాగాయని, సోషల్‌మీడియాలో పోస్టింగులకు కూడా కేసులు పెట్టారని ఆ రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ప్రగతి వైపు పయనిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో కూటమి విజయానికి ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న లక్షలాదిమంది తమవంతుగా పనిచేశారని, వారందరికంటే బెంగళూరు టీడీపీ ఫోరం చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఆదివారం కేఆర్ పురలో బెంగళూరు టీడీపీ ఫోరం (బీటీఎఫ్) 11వ వార్షికోత్సవాన్ని 'నవశకం' మంచి రోజులు వచ్చేశాయి పేరిట భారీగా నిర్వహించారు. ముఖ్యులుగా పాల్గొన్న మంత్రి సవితమ్మ మాట్లాడుతూ రాక్షస పాలనను వెళ్లగొట్టేందుకు ఫోరం ప్రతినిధులు అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. చంద్రబాబునాయుడును అరెస్టు చేసినప్పుడు బెంగళూరులో సాగిన పోరాటాలు దేశంలోని ఎన్నో ప్రాంతాలతోపాటు 40దేశాలలో కొనసాగేందుకు స్ఫూర్తినిచ్చాయని అన్నారు. తన పైనా 13 కేసులు పెట్టారని, 53 రోజులు అజ్ఞాతంలో తలదాచుకున్నా అన్నారు. ఉద్యోగం, వ్యాపారం కోసం బెంగళూరులో స్థిరపడినా ఆంధ్రప్రదేశ్ బాగుండాలనే లక్ష్యంతో ఫోరం పనిచేసిందని ప్రశంసించారు. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లోనూ తమ వంతు పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారన్నారు. పెనుకొండలో వారు నిస్వార్థంగా పనిచేసింది స్వయంగా చూశానని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతి పరంగా ముందుకెళుతోందన్నారు. వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ అసాధ్యమన్నారని, కానీ ఈరోజు ఆదివారమని ఒకరోజు ముందే రాష్ట్రమంతటా పంపిణీ చేసి చూపామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్థలు దారుణంగా మారాయని, కనీసం పర్యవేక్షణకు గ్రాంట్లు విడుదల చేయలేదని విచారం వ్యక్తం చేశారు. తెలుగువారందరికీ టీడీపీ ఫోరం స్ఫూర్తి అన్నారు. వారానికోసారి చేనేత వస్త్రాలు ధరించడం ద్వారా ఆ వర్గాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మాట్లాడుతూ చిత్తూరులో జన్మించినా బెంగళూరులో వ్యాపారాలు చేస్తూ తెలుగువారికి అండగా ఉండడాన్ని గుర్తించి ఎమ్మెల్యేను చేశారని తెలిపారు. బీటీఎఫ్‌తో తనకు ఎన్నో ఏళ్ల సంబంధం ఉందన్నారు. వారు ధైర్యంగా పోరాటం చేశారన్నారు. ఇటువంటి ఫోరంలు అన్ని రాష్ట్రాల్లోనూ ఏర్పాటై తెలుగువారి శక్తి చాటాలని పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ మూడేళ్ల కిందట ఫోరం సభ్యులు ఓ సభకు ఆహ్వానించారని, అప్పటి నుంచి వారితో సంబంధాలు ఉన్నాయన్నారు. ఇటీవలి ఎన్నికల్లో సాంకేతిక పరంగా ప్రచారం చేశారని, సొంతూరుపట్ల అభిమానంతో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేశారని అన్నారు. మీ సహకారాన్ని గుర్తించామని, మీకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పంలో చంద్రబాబు విజయానికి ఫోరం సభ్యుల కృషి మరువలేనిదని అన్నారు. కుప్పం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన తర్వాత తనతోపాటు 2,500 మంది సైనికుల్లా పనిచేశారన్నారు. రాబోయే తరానికి నాయకత్వ లక్షణాలు పెంపొందించిన ఘనత ఫోరం ప్రతినిధులదే అన్నారు. ఏపీకి మంచి రోజులు వచ్చాయని ఫోరం ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. రెడ్‌బుక్‌లో అన్నింటికీ న్యాయం జరుతుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ కార్యకర్తలకు అండగా బీటీఎఫ్ పోరాటం చేసిందన్నారు. వేధింపులు ఉన్నా తట్టుకుని నిరంతరంగా ఆందోళనలు చేసిన ఘనత ఫోరం సభ్యులదే అన్నారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ కనకమేడల వీర 11ఏళ్ల ప్రస్థానాన్ని వివరించారు. నవశకం సభ జరిగేందుకు శివ, కేశవ్, వంశీ, విజయ్, విష్ణు, రత్నం, పవన్, నారాయణతోపాటు పలువురు సభ్యులు కృషి చేశారన్నారు. ఇదే సందర్భంగా పార్టీ కోసం బెంగళూరులో కార్యక్రమాలకు సహకరిస్తున్న రాష్ట్ర పార్టీ కన్వీనర్ రావిమోహన్ చౌదరి, రాజేంద్రనాయుడుతోపాటు వివిధ జిల్లాల ప్రతినిధులను సత్కరించారు.



హాజరైన టీడీపీ అభిమానులు, కార్యకర్తలు



నాట్లకు కూలీల కొరత

● బిహార్ కూలీలను రప్పించుకుంటున్న రైతులు

● పెరిగిపోయిన కూలి ధరలు

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ఉండడంతో ప్రాజెక్టులు నిండాయి. దీంతో వరిసాగు చేసే రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నాట్లు వేసేందుకు స్థానిక కూలీలు లభించకపోవడంతో బిహార్ కూలీలను రప్పించారు. ప్రధానంగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో నాట్లు కొనసాగుతాయి. రాష్ట్రంలో వ్యవసాయకూలీల కొరత తీవ్రంగా ఉండడంతో ఏజెంట్ల ద్వారా బిహార్ నుంచి కూలీలను రప్పించారు. దావణగెరె జిల్లా హరిహరతోపాటు పలు ప్రాంతాల్లో బిహార్ కూలీలు వరినాట్లు వేస్తున్నారు. వీరు కృష్ణ, కావేరి, తుంగభద్ర జలాశయాల ఆయకట్టులో కొన్ని నెలలపాటు పనిచేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో వరినాట్లు వేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు రావడం కొత్తేమీకాదు. పొరుగున ఉండే తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడునుంచి మాత్రమే వచ్చేవారు. ఒక్కోసారి పంజాబ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. వివిధ కారణాలతో సాధారణంగా వరినాట్లకు వచ్చే కూలీలు అవసరమైనంత మేర లభించకపోవడంతో బిహార్ నుంచి రప్పించారు. సాధారణంగా ఎకరా వరినాట్లకు రూ.3,500 తీసుకుంటారు. బిహార్‌కు చెందినవారైతే రూ.4వేలు దాకా తీసుకుంటారు. డిమాండ్ ఎక్కువగా ఉంటే అదనంగా మరో రూ.500 తీసుకుంటారు. బిహార్ నుంచి వచ్చిన మహిళా కూలీలు ఒకసారి పనిలోకి వస్తే ముగించేదాకా కొనసాగుతారు. వీరికి ముందస్తు ఒప్పందంగా మధ్యాహ్నంలోపు పని ముగిస్తే ఆహార వస్తువులు ఇవ్వాల్సి ఉంటుంది. సాయంత్రం దాకా నాట్లు వేస్తే రాత్రి భోజన వ్యవస్థ కల్పించాలి. బిహార్ కూలీలు కర్ణాటకకే కాదు పలు రాష్ట్రాలకు వెళ్తుంటారని తెలుస్తోంది. వీరు నాట్లు వేసే విధానం చక్కగా ఉంటుంది. పైర్లను వరుస క్రమంతోపాటు భూమిలో నాటే విధానంలోనూ నాణ్యత పాటిస్తారు. అందుకే ఎక్కువ మంది బిహార్ కూలీలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం దావణగెరెకు వంద మందికిపైగా వచ్చారు. ఈ ఏడాది బిహార్ రాష్ట్రంలో కూడా ఎక్కువపని ఉన్నట్టు తెలుస్తోంది.



పాఠశాలలకు మరమ్మతులు ఎప్పుడో..?

● వరుణుడి ధాటికి దెబ్బతిన్న 3,819 భవనాలు

● సీఎం జిల్లాలో 21 ● విద్యామంత్రి జిల్లాలో 274 అధ్వానం



దక్షిణకన్నడ జిల్లా పెరబె గ్రామంలో ఇటీవల కూలిన పాఠశాల పైకప్పు

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తామని పాలకులు నిత్యం వేదాలు వల్లిస్తుంటారు. ప్రభుత్వం ఏదైనా విద్యకు పెద్ద పీట వేస్తున్నామని, బడ్జెట్‌లో ఎక్కువ గ్రాంట్లు కేటాయిస్తున్నామని చెబుతుంటారు. పలు ప్రాంతాల్లో పాఠశాల భవనాలు కూలిపోతున్నా పాలకులకు ఏమాత్రం పట్టలేదు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రైవేట్ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. రాష్ట్రంలో ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల్లో చేరేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ప్రాథమికోన్నత, హైస్కూళ్లలో కొంత మెరుగ్గా ఉంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లేమి వెంటాడుతోంది. ఇప్పటికీ పాఠశాలల్లో తాగునీరు, శౌచాలయం, ప్రహరీలు లేనివి ఎన్నో ఉన్నాయి. నాలుగేళ్ల కిందట ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచేందుకు పాఠశాలల దత్తత కార్యక్రమం ఉద్యమంలా సాగింది. అప్పట్లో ప్రైవేట్ యూనివర్సిటీలు, శాసనసభ్యులు, ఎంపీలు దత్తత తీసుకున్న పాఠశాలల్లో సౌలభ్యాలు మెరుగయ్యాయి. రాష్ట్రంలో గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో విద్యాసంస్థలకు తీరని నష్టమే మిగిల్చింది. దక్షిణకన్నడ జిల్లాల్లో కడబదకుంటూరు ప్రభుత్వ పాఠశాల గోడ కూలి నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. రాష్ట్రంలో 47,276 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 53.21 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 3,819 పాఠశాలల భవనాలు దెబ్బతిన్నాయి. రెవెన్యూశాఖ ఇటీవల జరిపిన సర్వేలో వీటిని గుర్తించారు. పెను ప్రమాదం జరగకుండా ముందస్తుగానే శిథిలావస్థకు చేరిన భవనాల్లో పాఠశాలల్లో తరగతులు కొనసాగించరాదని రెవెన్యూశాఖ హెడ్మాస్టర్లకు సూచించింది. బెళగావి జిల్లాలో ఏకంగా 1090 పాఠశాల భవనాలు అధ్వానంగా మారాయి. కూలేస్థాయికి చేరిన పాఠశాలల్లో బెళగావి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. హాసన్‌లో 591, హావేరిలో 541 పాఠశాలలు ఉన్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న మైసూరు జిల్లాలో 121 పాఠశాలలు అధ్వానంగా ఉండగా, ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప సొంత జిల్లా శివమొగ్గలో 274 పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. ఇక చిక్కమగళూరులో 269, ఉత్తరకన్నడలో 197, దక్షిణకన్నడలో 230, చామరాజనగరలో 111, విజయపురలో 105, దావణగెరె 89, బాగల్కోటెలో 64, ధారవాడ 51, ఉడుపి 47, రాయచూరులో 17, యాదగిరి జిల్లాలో 10 పాఠశాల భవనాలు అధ్వానంగా ఉన్నాయి. బెంగళూరు నగర, గ్రామీణ, బీదర్, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, కలబురగి, కోలారు, కొప్పళ, మండ్య, రామనగర, తుమకూరు, విజయనగరలలో పాఠశాల భవనాలు ఆశాజనకంగా ఉన్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

పాఠశాల భవనాలకు ఏటా మరమ్మతులు చేసేందుకు నివేదికలు సిద్ధం చేస్తారు. వేసవి సెలవులవేళ వాటిని బాగు చేయాలని జిల్లాల వారి ప్రతిపాదనలు పంపుతారు. సకాలంలో నిధులు రాకపోవడం, వాటి గురించి జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఏటా అధ్వానంగా మారిపోతున్నాయి. భారీ వర్షాలు నిరంతరంగా కొనసాగుతుండడంతో పాఠశాలలు అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా విద్యాశాఖ తరగతి గదుల అధ్వాన పరిస్థితిపై స్పందించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



దేవదుర్గ తాలూకాలో కృష్ణానది వంతెనపై ప్రవహిస్తున్న నీరు



జాలహళ్లి వద్ద కొట్టుకుపోయిన వంతెన

రాయచూరులో భారీ వర్షం

● పలుచోట్ల తెగిపోయిన రహదారులు ● రాకపోకలకు అంతరాయం

రాయచూరు సెప్టెంబరు 1 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు రాయచూరు జిల్లా ప్రజలను అతలాకుతలం చేశాయి. ఆదివారం పలుచోట్ల భారీ వర్షానికి రహదారులు తెగిపోయాయి. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ జలమయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రం రాయచూరు నగరంలో ఇప్పటికే గుంతలమయంగా మారిన రోడ్లన్నీ వర్షపు నీరు నిలిచి ఉండడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. మరో వారం రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందంటూ వాతావరణ శాఖ అధికారులు చేస్తున్న హెచ్చరికలు ప్రజల్లో భయాన్ని పుట్టిస్తున్నాయి. ఇప్పటికే నగరంలోని డ్రైనేజీలన్నీ పొంగిపొర్లుతూ రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండగా లోతట్టు కాలనీలన్నీ జలమయంగా మారాయి. ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లాకు చెందిన మరో మంత్రితో పాటు ముగ్గురు ఎమ్మెల్సీలు, నగర ఎమ్మెల్యే ఇంత మంది ప్రజాప్రతినిధులున్నా నగరంలో మాత్రం రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందంటూ ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. వర్షం రాకతో ఒక్కసారిగా రోడ్లన్నీ జలమయంగా మారాయని, రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నామని వాహనదారులు శాపనార్థాలు పెడుతున్నారు. పలు గ్రామీణ ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లు తుండడంతో రాకపోకలు నిలిచిపోగా అనేక చోట్ల రోడ్లపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దేవసుగూరు సమీపంలోని కాడ్లూరు రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో ఆ మార్గంలో సంచారం నిలిచిపోయింది. రాయచూరు నుంచి చంద్రబండా వైపు వెళ్లే కడగందొడ్డి వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడడంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాలహళ్లి వద్దగల మొరార్జీదేశాయి వసతి పాఠశాల సమీపంలోని వంతెన ఒకటి వర్షపు ధాటికి కొట్టుకుపోగా ఆ మార్గంలో రాకపోకలన్నీ నిలిచిపోయాయి. రాయచూరు నగరంలో 15.7 మీ.మీ, చంద్రబండా క్లష్టర్‌లో 13.8, దేవసుగూరు క్లష్టర్‌లో 22.5, గిల్లేసుగూరు క్లష్టర్‌లో 19.9, కల్మలా క్లష్టర్‌లో 21.8, యరగేరా క్లష్టర్‌లో 21.8, దేవదుర్గ తాలూకాలో 38.9 మీ.మీ మేరకు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాను ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు ప్రకటించామని, అప్రమత్తంగా ఉండాలంటు అధికారులు ఇప్పటికే అన్ని విధాల హెచ్చరికలు జారీ చేశారు.



మాన్వి పట్టణం సంగాపురలో అధ్వానంగా మారిన రోడ్డు



కేక్ కట్ చేస్తున్న బాలయ్య అభిమానులు

బాలయ్య అభిమానుల సంబరాలు


బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా బెంగళూరులోని ఆయన అభిమానులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ఎన్‌బీకే ఫ్యాన్స్ అసోసియేషన్ హలసూరు ఆధ్వర్యంలో బాలకృష్ణ, గంగాధర్, సూర్యనారాయణ తదితరులు కేక్ కట్ చేశారు. అభిమానులు అణ్ణప్ప, శేషాద్రి, భాస్కర్, ఐరన్ రాజు, బాలశ్రీధర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. బాలకృష్ణ సేవలను కొనియాడారు. నటుడిగానే కాకుండా బసవతారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా ఎంతోమందికి వైద్యసేవలు అందిస్తున్నారని కొనియాడారు.

భూ ఆక్రమణలపై కొరడా


● నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా తొలగింపులు

● డ్యాష్‌బోర్డ్‌లో అప్‌డేట్

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలంగా ఆక్రమణలకు గురైన రెవెన్యూ భూములను స్వాధీనం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సోమవారం నుంచి ఆక్రమార్కులపై కొరడా ఝళిపించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కార్యాచరణ ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 13.17 లక్షల ఎకరాల రెవెన్యూ భూమి ఆక్రమణలకు గురైనట్టు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా 230 మంది తహసీల్దార్లు రెవెన్యూ భూముల స్వాధీనానికై ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలో 26లక్షల ఎకరాలు రెవెన్యూ భూములు ఉన్నాయి. ఇందులో సగం అంటే 13.17 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. దశాబ్దాల కాలంగా పల్లె, పట్టణం, నగరం అనే తేడా లేకుండా ఆక్రమించుకుని వాటిలో వ్యవసాయం, నివాసాలు, ఇతరత్రా వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నవారిపై చర్యలు లేదంటే భవిష్యత్తులో ప్రజా అవసరాలకు భూములు ఉండవని నిర్ణయం తీసుకున్నారు. ఒకేసారి అన్ని తాలూకాల పరిధిలో రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒక్కో తహసీల్దార్ ప్రతి నెలా కనీసం 10 నుంచి 20 ఆక్రమణలు తొలగించేలా చేయాలని నిర్ణయించారు. ప్రతివారం జిల్లా అధికారులు సమీక్ష జరిపి రెవెన్యూ కమిషనరేట్‌కు నివేదిక సమర్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చెరువులు, రాజకాలువలు, స్మశానభూముల ఆక్రమణలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. రెవెన్యూ భూములను ఆక్రమించుకుని వాణిజ్య భవనాలు నిర్మించి ఉంటే వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగించాలి. ఒకవేళ పంటల సాగు చేస్తుంటే పంట చేతికొచ్చాక స్వాధీనం కొనసాగించాలి. రెవెన్యూ, విద్య, అటవీ, ఆరోగ్య, ప్రజాపనుల శాఖలతో కలిపి 14.10 లక్షల ప్రభుత్వ ఆస్తులు ఉన్నాయి. ప్రభుత్వ భూముల వివరాలను ల్యాండ్ బీట్ ద్వారా నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామాల వారీగా సర్వే నెంబర్లు, లోకేషన్లతోపాటు విస్తీర్ణం సమాచారాన్ని పొందుపరచాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 1.1 కోట్ల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్టు గుర్తించారు. గ్రామ పాలకమండలుల ప్రకారం 13.3 లక్షల ఆస్తులకు సంబంధించిన వివరాలను యాప్‌లో పొందుపరచడంలో విజయవంతమయ్యారు. 2.70 లక్షల ఆస్తులను రెవెన్యూభూమిగా గుర్తించారు. యాప్ ద్వారా ప్రయోగాత్మకంగా నమోదు ప్రక్రియ అమలు చేస్తున్నారు. రెవెన్యూశాఖతోపాటు సర్వే అధికారులు ఆక్రమణలను ఒకేసారి పరిశీలించి స్వాధీనం చేసుకోదలిచారు. సర్వే అధికారులు నిరంతరంగా రెవెన్యూ అధికారులతోపాటు ఉండాలని సూచించారు. తహసీల్దార్లు స్వాధీన ప్రక్రియను ప్రధానమైన చర్యగా భావించాలని రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ సూచించారు. రైతులు సాగు చేస్తున్న భూములకు మాత్రం కొంత కాలం వెసులుబాటుకు అవకాశం ఇచ్చారు. గోమాళ, గుండుతోపు, రోడ్లతోపాటు ఇతరత్రా భూములను గుర్తించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు భూముల స్వాధీన ప్రక్రియను డ్యాష్‌బోర్డ్‌లో అప్‌డేట్ చేయిస్తారు. బెంగళూరులోని కేంద్ర కార్యాలయంలోని డ్యాష్‌బోర్డు పరిశీలిస్తే జిల్లా అధికారులు, అసిస్టెంట్ కమిషనర్లు, తహసీల్దార్ల ప్రగతి తెలుస్తుంది.



రెవెన్యూశాఖ కార్యాలయం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.73	1,624.92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	40,107	688
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13,475	9,363
సామర్థ్యం (టీఎంసీలు)	96.84	76.22

రేపు వీరభద్రేశ్వర స్వామి జయంతి



బళ్లారి సిటీ, సెప్టెంబరు 1: ఈనెల 3న నగరంలోని అనాదిలింగేశ్వరాలయంలో శ్రీ వీరభద్రేశ్వరస్వామి జయంతోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త జీ.ఎం బసవరాజు తెలిపారు. అనాదిలింగేశ్వరాలయంలోని వీరభద్రేశ్వరుడికి ఉదయం రుద్రాభిషేకం జరుగుతుందని, తదుపరి ముత్తైదువులు కలశం, ఇతర జానపద వాయిద్యాలతో కనకదుర్గమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి శ్రీ వీరభద్రేశ్వరస్వామి సన్నిధికి చేరుకుంటారన్నారు. తదుపరి పూజ, ఆశీర్వాదం, మహా మంగళ హారతి, ప్రసాద పంపిణీ జరుగుతాయన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



హైస్కూలు గ్రౌండ్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులు

సిరుగుప్ప, సెప్టెంబరు 1: సిరుగుప్ప పట్టణంలోని హైస్కూలు గ్రౌండ్‌లో జడ్పీ ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులు జరుగుతున్నాయి. యంత్రాలను ఉపయోగించి పనులను వేగంగా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వర్షపునీరు నిలిచి తరచుగా బురదగా మారుతుండడంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు.

మెట్రి సహకారసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న సభ్యులు

కంప్లి, సెప్టెంబరు 1 : తాలుకా పరిధిలోని మెట్రి ప్రాథమిక కృషి పత్తిన సహకారసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షులుగా హోసకోటి జగదీష్, ఉపాధ్యక్షులుగా గంగాధర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బళ్లారి సహకార సంఘాల అభివృద్ధి అధికారి దుర్గప్ప తిప్పనాళ్ తెలిపారు. గెలిచిన అనంతరం జగదీష్, గంగాధరలను తోటి సభ్యులతో పాటు గ్రామస్తులు అభినందించి, సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వ సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. వారితో పాటు షెక్షావలీ, పాండురంగ, మరేగౌడ, వీరభద్రప్ప, పక్కీరప్ప, అయ్యప్ప, చంద్రశేఖర్, మంజుళ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయకాలనీకి సదుపాయాలు కల్పించాలి



వర్షంతో బురదమయంగా మారిన దారి

సిరుగుప్ప, సెప్టెంబరు 1 : 16వ వార్డు ఆత్రేయ కాలనీలో మౌలిక సదుపాయాల కరువుతో ప్రజలు సతమతమవుతున్నారు. సిరుగుప్ప నగరసభ పరిధిలో నిరుపేదలకు ఇక్కడ ప్రభుత్వం నివాస స్థలాలను ఏర్పాటు చేసింది. కాని నగరసభ ఈ కాలనీలో రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. వర్షంతో దారంతా బురదమయంగా మారింది. ప్రజలు విద్యుత్, తాగునీటి సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అనేక మార్లు నగరసభ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా ఈ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షబీభత్సం

- భారీ వర్షాలకు ఇళ్లలోకి చేరిన నీరు
- నీటమునిగిన పంటలు
- చనిపోయిన మేకలు





వర్షాలకు కోసుకుపోయిన మోకా రోడ్డు



వర్షాల దెబ్బకు చెళ్లికెర వద్ద మృతిచెందిన మేకలు

బళ్లారి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా బళ్లారి, కొప్పళ, విజయనగర, రాయచూరు, చిత్రదుర్గం జిల్లాల్లో వానలు కురుస్తూనే ఉన్నాయి. వానకు తోడుగా గాలులు కూడా వీస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తుంగభద్ర తీర ప్రాంతంలో ఉండే గ్రామాలలోకి నీరు చేరింది. కొప్పళ, విజయనగర(హొస్పేట్), బళ్లారి జిల్లాలో ని నది తీర గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. వరద పోటుకు రోడ్లు కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సండూరు, కుడితిని, హువ్వినహగడలి, సిరుగుప్ప, ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా జడివాన కురుస్తుండడంతో జనజీవనం అతలాకుతలం అయింది. పశువుల, ఇతర జీవాలు మేతకు వెళ్లలేదు, మిరప, కాయగూరల రైతులు చెట్టు నుండి కాయలను కోయలేక చెట్లపైనే వాటిని వదిలివేశారు పూలు, కూడా చెట్లపైనే ఉండి చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొప్పళ, విజయనగర జిల్లాల నుండి హైద్రాబాద్, బెంగళూరు, ఇతర రాష్ట్రాలకు రాకపోకలు సాగించే బస్సులు హైవేలపై వరద నీరు చేరడంతో ఎక్కడివక్కడే నిల్చిపోయాయి. హొస్పేట్‌లో ఉలిగి, హోసూరు, అలాగే నగరంలోని వంకాయకాలనీ టీడీడ్యాంలో చేపల కాలనీలలో లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరుచేరి జనజీవనం అతలాకుతలం అయింది.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

కురుస్తున్న వర్షాలకు కురుగోడు, తెక్కలకోట, సండూరు తదితర ఏరియాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువులు నిండి కోడిపారుతున్నాయి. ఇలా అనేక రకాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటికి తోడు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనం రాత్రిపూట బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సహాయచర్యల కోసం ఎదురుచూస్తున్నారు.

విలువలు పాటిస్తేనే మానవ జన్మ సార్థకం

- కమ్మసంఘం జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూఫ్ కుమార్

బళ్లారి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): విలువలు పాటిస్తూ సమాజంలో మంచి పనులు చేసిన వారికి ఎప్పటికి గౌరవమర్యాదలు అందుతాయని బళ్లారి జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు, మాజీ మంత్రి ముండ్లూరు రామప్ప తనయుడు ముండ్లూరు అనూఫ్ కుమార్ అన్నారు. అనూఫ్ కుమార్ జన్మదిన వేడుకలను శనివారం కమ్మసంఘం సభ్యులు, ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. విమ్స్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే ట్రామాకేర్ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు. అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. అనంతరం కమ్మభవనం, ముండ్లూరు అనూప్ గార్డెన్‌లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. విమ్స్ ఆసుపత్రిలో అన్నదానం కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కురుగోడు మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ముండ్లూరు అనూఫ్ కుమార్ చాలా మంచి వ్యక్తి అని, ఆయన వివాదాలకు దూరంగా ఉంటారన్నారు. బళ్లారిలో ముండ్లూరు కుటుంబం అంటే ఎంతోపేరు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు కమ్మసంఘం నాయకులు, కార్యవర్గసభ్యులులతోపాటు కాంగ్రెస్ నాయకులు లోకేష్, రఘు, ముల్లంగి చంద్ర, వెంకటకృష్ణ, శ్రీనివాసులు, కేఎంఎఫ్ డైరెక్టర్ ధనుంజయ, చిబిలి ప్రకాష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కమ్మసంఘం అధ్యక్షుడు అనూఫ్ కుమార్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

కంప్లి, సెప్టెంబరు 1 : రానున్న పండుగలు వినాయక చవితి, ఈద్‌మిలాన్ పండుగలను హిందూ, ముస్లింలు శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రసాద్‌గోఖలే తెలిపారు. కుడితిని పట్టణం పల్లెదభవన్‌లో ఏర్పాటు చేసిన శాంతిసభలో ఆయన రెండు మతాల వారికి ఆయన పలు సూచనలు చేశారు. ఈ పండుగలను అందరూ కలసికట్టుగా ఐక్యతతో జరుపుకోవాలన్నారు. అప్పుడే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. గణేష పండుగ రోజు మట్టి వినాయకులనే కూర్చొబెట్టాలన్నారు. పీవోపీ గణపతులను కూర్చోబెట్టరాదన్నారు. వీటి వల్ల నీటి కలుషితం జరుగుతుందన్నారు. అలాగే వినాయకుడిని వదిలే సమయంలో డీజేలు వాడటం వల్ల అందరికీ ఆటంకం కలిగించరాదన్నారు. అలాగే ప్రతి ఒక్కరు గ్రామ పంచాయతీ అధికారులకు, పట్టణ పంచాయతీ అధికారులకు, వినాయకుడిని కూర్చోబెట్టే స్థలాలు తెలియజేసి అనుమతులు పొందాలన్నారు. ఈద్‌మిలాన్ పండుగను కూడా సామూహికంగా చేపట్టాలన్నారు.ద్విచక్రవాహనాల సైలెన్సర్లు తీసి శబ్దాలు వచ్చే విధంగా వాహనాలు నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం షణ్ముఖప్ప మాట్లాడుతూ కుడితిని పరిధిలోని తిమ్మలాపురం, దరోజీ, ఏళుబెంచి, దేవలాపురం, మాదాపురం, సుల్తాన్‌పురం, వేణి వీరాపురం తదితర గ్రామాల్లో పండుగలను అందరూ ఐక్యతతో జరుపుకోవాలన్నారు. వారితో పాటు సీపీఐ విశ్వనాథ్, ఎస్ఐ శాంతమూర్తి, విరుపాక్షప్ప, వీకేసీ చంద్రన్న, రఘు, వివిధ గ్రామాల ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



కుడితిని శాంతిసభలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలే

సాంస్కృతిక కార్యక్రమాలతోనే మానసిక దృఢత్వం

యువజనోత్సవాల్లో ప్రొ.రుద్రేశ్

బళ్లారి సిటీ, సెప్టెంబర్ 01: సాంస్కృతిక కార్యక్రమాలతోనే విద్యార్థులలో మానసిక దృఢత్వం ఏర్పడుతుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ రుద్రేశ్ అన్నారు. పాఠ్యేతర కార్యకలాపాలలో పాల్గొనని విద్యార్థులు అకృత్యాలకు గురవుతున్నారన్నారు. నేషనల్ సర్వీస్ ప్లానింగ్ సెల్, యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్, యూనివర్శిటీ సహకారంతో 27నుంచి 31వరకు ఐదు రోజుల పాటు విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలో స్టేట్ లెవల్ యూత్ ఫెస్టివల్ జరిగింది. ఆడిటోరియంలో శనివారం ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పాటపాడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సృజనాత్మకత, ప్రతిభ, అభిరుచిని ప్రదర్శించడంలో ఇలాంటి వేదికలు ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను శారీరకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దుతాయన్నారు. యూనివర్శిటీ నేషనల్ సర్వీస్ స్కీమ్ కోఆర్డినేటర్ డా.కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే యువజనోత్సవ ఉద్దేశ్యమన్నారు. ఐదు రోజుల రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలపై నివేదికను ఆయన చదివి వినిపించారు. ఈసందర్భంగా రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డా. మోహన్‌దాస్, కన్నడ అధ్యయన విభాగాధిపతి ప్రొ.రాబర్ట్ జోస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి శశిధర కల్లూరు, వివిధ విశ్వవిద్యాలయాల అధికారులు వేదికపై ఉన్నారు. రాష్ట్రంలోని 21 యూనివర్శిటీల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారు. ఐదు రోజుల స్టేట్ లెవల్ యూత్ ఫెస్టివల్ 2024లో జరిగిన పోటీల్లో మంగళూరు యూనివర్శిటీ మొదటి ఓవరాల్ బహుమతిని కైవసం చేసుకుంది. రెండవ సమగ్ర పురస్కారాన్ని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కైవసం చేసుకుంది. విజేతలకు యూనివర్శిటీ ఛాన్సలర్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వివిధ విభాగాల డీన్‌లు , విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ రుద్రేశ్

బాలకృష్ణ అభిమానుల అన్నదానం



కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమాన సంఘ సభ్యులు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 1 : నందమూరి బాలకృష్ణ సినీపరిశ్రమలో కాలుపెట్టి 50 వసంతాలు పూర్తి కానున్న నేపథ్యంలో బాలకృష్ణ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బళ్లారి నగరం రాయల్ సర్కిల్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బళ్లారి మేయర్ ముళ్లంగి నందీష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు బుజ్జప్ప, జగన్మోహన్ రెడ్డి, లోకొరెడ్డి మల్లయ్య, ఈరన్న, పంపా, ఈరన్న లోకొరెడ్డి, పాలాక్షిరెడ్డి, బసవరాజు, నందమూరి బాలకృష్ణ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి



మిరప పంటలో తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న పరిశోధకులు

కంప్లి, సెప్టెంబరు 1: రైతులు పలుజాగ్రత్తలు పాటించకపోతే పంటలు నష్టపోతారని వ్యవసాయశాఖ పరిశోధకుడు సునీల్ నాయక్ తెలిపారు. రైతురామకృష్ణ వేసిన మిరప పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ పంటలో ఏ పంట వేసినా కూడా పలు జాగ్రత్తలు చేపట్టకపోతే పంటలు రోగాలబారిన పడతాయన్నారు. ఖరీఫ్ పంటలో సిజెంటా రకం మిరప వేసుకున్న రైతులు బయోలజికల్ బయో హార్ట్ పిచికారి మందులు వాడితే కాండం తెగుళ్ల సోకకుండా వుంటాయన్నారు. వాటితో పాటు ట్రైకడోడెర్మా, అర్జీనియం పిచికారి చేస్తే మిరప పంటలకు ఎలాంటి తెగుళ్ల సోకకుండా పంటలు ఏపుగా పెరిగి పుష్కలంగా పంటలు వస్తాయన్నారు. గత కొన్ని రోజులుగా బళ్లారి జిల్లాలో వ్యవసాయపరంగా విద్యార్థులు, రైతన్నలకు రైతు రామకృష్ణపొలంలో వేసిన మిరప పంటపై అవగాహన కల్పించారు. ఇప్పటికే పలు చోట్ల మిరప పంటలకు తెగుళ్ల సోకి పూర్తిగా నష్టపోతున్నారన్నారు. రైతులు సకాలంలో జాగ్రత్తలు వహించకపోతే నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ విద్యార్థులు, రైతులు, డాక్టర్ అభిలాష్, విద్యావతి, రహెమతుల్లా, ఆదినారాయణ, సాయికుమార్, రామాంజినేయ, నరసింహులు, రమేష్, పుల్లయ్య, నజీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కురుగోడును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతా



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 1: కురుగోడును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. ఆదివారం కురుగోడు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్లి, కురుగోడు ఈ రెండు తాలుకాలకు కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే మినీ విధానసభలు కూడా సిద్ధమయ్యాయన్నారు. త్వరలో వాటిని కూడా ప్రారంభిస్తామన్నారు. జిల్లాలోనే ఈ రెండు తాలుకాలను పూర్తిగా అభివృద్ధి చేపట్టి మాదిరి తాలుకాలుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త అభివృద్ధి పనులకు ముందుకు రావాలని సూచించారు. వారితో పాటు పురసభ అధ్యక్షులు శేకన్న, ఉపాధ్యక్షులు చెన్నపట్టణ మల్లికార్జున, ఓంకారప్ప, బంగి మల్లయ్య పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి



ఇళ్లముందు పెరిగిన కోనోకార్పస్ మొక్కలు

కంప్లి, సెప్టెంబరు 1: కుడితిని పట్టణంలో రాఘవేంద్ర కాలనీలో వుండే కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని ఆ వార్డు ప్రజలు పేర్కొన్నారు. ఈ మొక్కల వల్ల విద్యార్థులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. గతంలో అక్కడ ప్లాట్లు ఏర్పాటు చేసినవారు ఆ మొక్కలను పెంచారు. అవి ప్రస్తుతం పెరిగి పెద్దవయ్యాయి. వాటి వల్ల వచ్చే గాలి వల్ల పూర్తిగా అనారో గ్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడతాయని, కావున వెంటనే పట్టణ పంచాయతీ అధికారులు రాఘవేంద్ర కాలనీలో వున్న కోనోకార్పస్ మొక్కలను తొలిగించి అనారోగ్యం పాలు కాకుండా చూడాలని కోరారు. రెండురోజుల క్రితం కంప్లి బస్టాండులో వున్న మొక్కలను తొలగించారని కనుక ఇక్కడున్న అధికారులు వీటిని తొలగించే విషయంపై ముందుకు రావాలని కోరారు.

హోసూరు జోన్

ఆర్గానిక్ మార్కెట్ ప్రారంభం



ఆర్గానిక్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

హోసూరు, సెప్టెంబరు 1: హోసూరు ప్రభుత్వ పరిధిలోని ఫ్లవర్ మాల్‌లో ఆర్గానిక్ మార్కెట్‌ను ఆదివారం ఎమ్మెల్యే వై.ప్రకాశ్ కొవ్వొత్తి వెలిగించి ప్రారంభించారు. సహజ జీవనాన్ని కాపాడేందుకు ప్రాచీన సంప్రదాయాలను పునురుద్దరిస్తూ రైతు బజారు సమీపంలో ఏడాదికి పైగా సేంద్రియ మార్కెట్‌ను కొనసాగిస్తున్నారు. సరిపడా స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న వారి విన్నపాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఫ్లవర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కొంత భాగాన్ని వారికి కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజానీకానికి అవసరమైన బియ్యం రకాలు, దేశీయ బియ్యం రకాలు, అనేక వ్యాధులను నయం చేసే బియ్యం రకాలు, ఈ మార్కెట్‌లో సాంప్రదాయ చిరుతిండ్లు, నెయ్యి. తేనే, మందులు లేని ఆర్గానిక్ కూరగాయలు, పాలకూర, స్థానిక కూరగాయలు విక్రయిస్తారని తెలిపారు. సుదీర్ఘ పోరాటం తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రకటించడంతో ఈ మార్కెట్‌కు చోటు దక్కిందని తెలిపారు. ఆ విధంగా సహజ ఆహారానికి ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తుల్లో ఆర్గానిక్ మార్కెట్ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. కావున జీవనం మెరుగుపడాలంటే ఇంట్లోనే ఉత్పత్తులను తయారు చేయాలన్నారు.

భార్యాభర్తల అనుబంధం గొప్పది

హోసూరు(సిఫ్‌కాట్) సెప్టెంబరు 1: ప్రతి వ్యక్తి వైవాహిక జీవనంలో కుటుంబాల మధ్య బంధాన్ని పెంచే భార్యాభర్తల అనుబంధం గొప్పదని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. హోసూరు మండలం, మనవళ్కలై పౌండేషన్ ఆధ్వర్యంలో మీరా మహల్ కళ్యాణ మంటపంలో ఆదివారం వేదాత్రి మహర్షి సతీమణి యోగంపాల్ 110వ జయంతి సందర్భంగా 300 మంది జంటలు పాల్గొన్నాయి. ఇంతకుముందు ఈ జంటలు ఒకరికొకరు కృతజ్ఞతలు తెలియజేసుకుని, అనంతరం పూలుపండ్లను ఇచ్చిపుచ్చుకున్నారు. ఆ తర్వాత ఒకరి చేతులు మరొకరు పట్టుకుని కూర్చుని పెళ్లైనప్పటి నుంచి జరిగిన సంఘటనలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వీరానందం, విజయలక్ష్మి అధ్యక్షురాలు వైరవేల్, ఆరోగ్యదాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలయ్య సినీ స్వర్ణోత్సవం

హోసూరు సెప్టెంబరు 1: సినీనటుడు బాలకృష్ణ సినీ రంగంలో ప్రవేశించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హోసూరులో ఆ వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. సంఘ అధ్యక్షుడు మల్లప్ప ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన కార్యక్రమంలో కేకు కట్ చేసి అందరికి పంచిపెట్టారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆయన చిత్రాల్లోని వివిధ పాత్రలను గురించి అందరు కొనియాడారు. ఆయన సిని ప్రస్థానాన్ని ప్రముఖులు కొనియాడుతూ, ఎన్‌టీరామరావు వారసుడుగా ఆయనపేరు నిలపెట్టారని, ఇప్పటికే ఆయన చురుకుగా ఎంతో ఉత్సాహంగా సినిమాల్లో న టిస్తూనే ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస యాదవ్ , వెంకటేష్, బస్తీ శ్రీనివాస్, రమేశ్ తదితర అభిమానులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి స్వర్ణోత్సవం జరుపుకుంటున్న అభిమానులు

విద్యతోనే అభివృద్ధికి బాట

- సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్



ప్రతిభ కనబరచిన విద్యార్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయచూరు, సెప్టెంబర్ 1: విద్యతోనే సమాజంలోని అన్ని రకాల అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందని ప్రతి ఒక్కరు విదఽ్యవంతులుగా ఎదిగి అభివృద్ధి ఫలాలను అందుకోవాలని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ సూచించారు. సవితా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కన్నడ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కార కార్యక్రమాముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సవితా సమాజం మిగతా వారితో పోలిస్తే సంఖ్య పరంగా అతి తక్కువగా ఉన్నప్పటికి ఏటా పలు రకాల సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తు అందరికి ఆదర్శంగా నిలిచిందంటూ అభినందించారు. కులవృత్తిపై ఆధారపడి జీవించే సవితా సమాజం వారు వృత్తిని దైవంగా భావిస్తు ఆర్థికంగా పురోగతి సాధిస్తుండడం ఇతరులకు మార్గదర్శకమన్నారు. కులవృత్తి ఏదైనా దానిపట్ల చులకనభావం ఉండకుండా నిబ ద్ధతతో పని చేయడం ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకోగలమన్నారు. గత ఏడాది టెన్త్,పీయూసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన సవితా సమాజం విద్యార్థులకు సవితా సమాజానికి చెందిన వారు వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతిభ పురస్కారాలు అందజేశారు.

రేపు జిల్లాకు రానున్న కేంద్ర మంత్రి సోమణ్ణ

రాయచూరు, సెప్టెంబర్ 1: కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణ మంగళవారం జిల్లా పర్యటనకు రానున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లాలోని నీలగల్ అంగనవాడీ కేంద్రానికి చేరుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి జక్కలదిన్నికు వెళ్లి అటు నుంచి సిరవార తాలూకా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించనున్నారు. మధ్యహ్నాం సిరవార పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించనున్నారు. మధ్యా హ్నాం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లాధికారి ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు.

ప్రతిపక్షాల ఆరోపణలకు బదులిస్తాం

బంగారపేట, సెప్టెంబరు 1: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ పథకాలకు నిధులను భారీగా మళ్లించడం ద్వారా అభివృద్ధి పనులు సాగలేదన్న ప్రతిపక్షాల ఆరోపణలకు బదులిస్తామని కేయూఐడీఎఫ్‌సీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. తాలూకాలోని కామసముద్ర హోబళి జానుగుట్టె గ్రామం వద్ద కేఎస్‌హెచ్‌పి పథకం కింద రూ.20కోట్లతో డాంబరీకరణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామసముద్ర హోబళి పరిధిలో కాంగ్రెస్‌కు అత్యధిక ఓట్లు లభించినంత మాత్రాన ద్వేషరాజకీయాలకు పాల్పడేది లేదని, కులమతాలకు అతీతంగా సమగ్ర అభివృద్ధికి శ్రమిస్తామన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, గ్రామపంచాయతీ అధ్యక్షుడు జయణ్ణ, లక్ష్మమ్మ, నాగమణి లక్ష్మీనారాయణ, రామ్‌శెట్టి, ప్రముఖులు కెటీఆర్ రంగనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కామసముద్ర హోబళిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడ్డాం

హొస్కోటె, సెప్టెంబరు 1: తాలూకాలోని అన్ని గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడ్డామని ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బెళ్శికెరె, అజగొండహళ్ళి, కోటూరు, రామస్వామిపాళ్య, నాగనాయకనకోటె, తిరుమలశెట్టి క్రాస్‌లో సుమారు 9 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. తాలూకాలోని చెరువులకు నీరు కల్పించేడానికి ఎత్తిపోతల పథకాన్ని వడ్డళ్ళి గ్రామం వద్ద నీటి సేకరణ కేంద్రాన్ని నిర్మించనున్నట్టు ఒక టీఎంసీ నీటిని తాలూకా చెరువులకు మళ్లించనున్నట్టు తెలి పారు. నీటి సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్టు తెలిపారు. బముల్ డైరెక్టర్ మంజునాథ్, హొసళ్ళి ప్రకాశ్ బీంఎఆర్‌డీపి సభ్యుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజలో ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ

మైసూరు నగర రోడ్లపై గుంతలు పూడ్చివేత


రోడ్ల మరమ్మతులు చేస్తున్న యంత్రాలు

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాడహబ్బ దసరా ఉత్సవాలకు మైసూరు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా మైసూరు మహానగర పాలికె ఆధ్వర్యంలో నగరంలోని ప్రముఖ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేయడంతోపాటు రోడ్లను బాగు చేసే ప్రక్రియ చేపట్టింది. మైసూరు పాలికె పరిధిలోని 9 ప్రాంతీయ కార్యాలయాల నుంచి ప్రత్యేకంగా కంట్రాక్టర్‌ల సాయంతో పనులు ప్రారంభించారు. 1500కుపైగా గుంతలను గుర్తించి వాటిని పూడ్చే పనుల్లో నిమగ్నమయ్యారు. పాలికెలోని 9 డివిజన్‌లలో తలా 60-70 గుంతలు ఉన్నాయని సంబంధిత ఇంజనీర్లు కమిషనర్‌కు నివేదిక సమర్పించినట్టు తెలుస్తోంది. ఇ-టెండర్ ద్వారా కంట్రాక్టర్‌లకు అప్పగించారు. నాలుగైదు రోజులుగా పనులు వేగిరంగా సాగుతున్నాయి. త్వరలోనే రోడ్ల గుంతల పూడ్చివేత ప్రక్రియ ముగియనుందని ఇన్‌చార్జ్ ఇంజనీర్ కె.జె.సింధు తెలిపారు. కొన్ని చోట్ల కాలువలలో వర్షపునీరు నిల్వ ఉండడాన్ని గుర్తించి పూడికతీత పనులు చేస్తున్నామన్నారు. ఇందుకు కాంక్రీట్‌స్లాబ్ తొలగించి ప్రక్రియ పూర్తయ్యాక మూసివేస్తున్నట్టు తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


సంఘం ధార్మికసమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 1: ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో తాలూకాలోని మేలూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ధార్మికసభ, సంఘం పదాధికారుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ సభ్యుల ఆర్థిక ప్రగతికోసం రుణాలు సదుపాయం కల్పిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆలయాల జీర్ణోద్ధరణ, పాల ఉత్పత్తిదారుల సంఘాల భవనాలకు నిధులు, వృత్తిపరమైన కోర్సులు చేసేవారికి స్కాలర్‌షిప్, పేదలకు నెలవారీ పింఛను ఇస్తున్నట్టు తెలిపారు. అలాగే గ్రామాల సుభిక్షత, ప్రజలలో ఐక్యత పెంచేందుకు సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన రాష్ట్ర కార్యాధ్యక్షుడు భక్తరహళ్ళి బైరేగౌడ మాట్లాడుతూ కులమత బేధాలు లేకుండా సంఘం సామాజిక సేవలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కాకచుకొండనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సంఘానికి రూ.2లక్షల మంజూరు చేయడంతోపాటు స్వసహాయ సంఘం సభ్యురాలు రత్నమ్మకు వీల్‌చెయిర్, గంగాదేవి సంఘం సభ్యురాలు భారతికి వాటర్‌బెడ్, వినాయక సంఘం సభ్యురాలు మూర్తి కుమార్తె గానకు రూ.4వేల స్కాలర్‌షిప్ అందచేశారు. సమావేశంలో తాలూకా యోజనాధికారులు సురేశ్‌గౌడ, సమాజసేవకురడు కంబదహళ్ళి సురేంద్రగౌడ, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ రమేశ్, జిల్లా జనజాగృతి వేదిక సభ్యుడు త్యాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

బాగేపల్లి, సెప్టెంబరు 1: తాలూకాలోని ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అక్షయ, సంజీవిని పథకాలకింద స్వసహాయ 13 సంఘాలకు తలా లక్ష రూపాయలు, చేళూరు తాలూకాలోని చాకవేలు మహిళా స్వసహాయ సంఘాలకు తలా రూ.1.50 లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే సుబ్బారెడ్డి చెక్కులు అందజేసి మాట్లాడుతూ పిల్లల విద్యాభ్యాసం, ఆరోగ్యం, పాడి పెంపకం, చేతివృత్తుల తయారీ వంటి వాటికి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల గురించి వివరించారు. ఇకపై ప్రతి బుధవారం జనతా దర్శన్‌లో ప్రజలు తమ సమస్యలను ప్రస్తావించడం ద్వారా స్థానిక అధికారులు పరిష్కారం చేస్తా రన్నారు. తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి రమేశ్, తహసీల్దార్ మనీషా మహేశ్ పత్రి, తాలూకా నరేగా అధికారి నారాయణ, తాలూకా సాక్షరతా అధికారి ఎస్ శివప్ప పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

పర్యావరణ స్నేహిగా పండగ ఆచరిద్దాం

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే వినాయక చవితి పండుగను పర్యావరణ స్నేహిగా ఆచరిద్దామని బి-ప్యాక్ సంస్థ పిలుపునిచ్చింది. నగరంలోని కబ్బన్ పార్కులో ఆదివారం మట్టితో వినాయక తయారీ శిబిరం నిర్వహించింది. బాలభవన్ సొసైటీ, బి-ప్యాక్, బి-క్లిప్ అల్యూమిని అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటైంది. పెద్దసంఖ్యలో పాల్గొన్న చిన్నారులకు వినాయక విగ్రహాల తయారీకి అవసరమైన మట్టిని సమకూర్చారు. కొంతమంది నిపుణులు కూడా పాల్గొని సలహా సూచనలు చేశారు. వినాయక చవితి పండుగను ప్రజలు పర్యావరణ స్నేహిగా ఆచరించాలని పిలుపు నిచ్చారు. పలువురు విద్యార్థులు మట్టితో గణేశ విగ్రహాన్ని తయారు చేసి తమ ప్రతిభను చాటారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


మట్టి విగ్రహాల తయారీలో చిన్నారులు

మిసెస్ ఇండియా కర్ణాటకగా అక్షతా అశోక్

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిస్ అండ్ మిసెస్ ఇండియా కర్నాటక ఎనిమిదో విడత పోటీల్లో మిసెస్ ఇండియా ఇండిపెండెంట్ ఇంటర్నేషనల్ విజేతగా అక్షతా అశోక్ కులకర్ణి విజయం సాధించారు. మూడు రోజులపాటు వివిధ విభాగాలలో పోటీలు సాగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి భాగస్వామ్యులయ్యారు. డాక్టర్ నిశితా శెట్టి యాన్, మిసెస్ ఇండియా ఎర్త్ ఇంటర్నేషనల్ కిరీటాన్ని శృతిబల్లాల్ దక్కించుకోగా, క్లాజిక్ మిసెస్ ఇండియా ఎర్త్ ఇంటర్నేషనల్ విభాగంలో ప్రగతి అనూన్ విజయం సాధించారు. 35 మంది ఫ్యాషన్‌షోలో పాల్గొన్నారు. ప్రతిభాస్ శౌషిమఠ కర్ణాటక డైరెక్టర్ పర్యవేక్షణలో జరిగిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా అవినాశ్, జయంతిబల్లాల్, కల్నల్ డాక్టర్ ఎంసి శర్మ వ్యవహరించారు.


పోటీల్లో పాల్గొన్న మహిళలు

వృద్ధుల పట్ల ఆదరణ చూపుదాం

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వృద్ధు ల పట్ల ఆదరణ చూపాలని అతుల్య సంస్థ ఫౌండర్ డైరెక్టర్ కృష్ణకావ్య అభిప్రాయపడ్డారు. ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో కేరింగ్ ఫర్ ఏ సీనియర్ పేరిట వాకథాన్‌ను నిర్వహించారు. కార్పొరేట్ ఉద్యోగులు, విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. నగరంలోని వివిధ మార్గాలుగా సాగిన వాకథాన్ విధానసౌధ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా కృష్ణ కావ్య మాట్లాడుతూ అతుల్య సంస్థ నగరంలో వివిధ ప్రాంతాలలో ప్రత్యేక కేంద్రాలను కొనసాగిస్తోందన్నారు. వివిధ నగరాలలోనూ సెంటర్‌లు ఉన్నాయన్నారు. సీనియర్ సిటిజన్‌లకు చేదోడుగా ఉండాలన్నదే అతుల్య ఆశయమన్నారు. వాకథాన్‌లో సుమారు 500మంది పాల్గొన్నారు.



విధానసౌధ వద్ద వాకథాన్‌లో సంస్థ సభ్యులు

ప్రైవేట్ పీయూ కళాశాలల సంఘాల బలోపేతానికి కృషి



ప్రైవేట్ పీయూ కళాశాలల సంఘాల మహాసభ సమావేశంలో ప్రముఖులు

బెంగళూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక అన్‌ఎయిడెడ్ పీయూ కళాశాలల పాలకమండలుల సంఘాల (కుప్మా) 2023-24 వార్షిక మహాసభ నగరంలోని శేషాద్రిపురం కళాశాల సభాంగణంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం మోహన్ ఆళ్వ మాట్లాడుతూ కార్యవర్గ సమితిని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల న్నారు. ప్రైవేట్ పీయూ కళాశాలల సమస్యల గురించి ప్రభుత్వంతో చర్చించి సమితి సభ్యులను సమన్వయం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ నరేంద్ర ఎల్ నాయక్, బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు కీర్తన్‌కుమార్, బెంగళూరు కుప్మా సంఘం కార్యదర్శి డాక్టర్ దేవరాజ్ టికె, బెంగళూరు దక్షిణ జిల్లా కుప్మా అధ్యక్షుడు డాక్టర్ జయరామ్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు. మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు జిల్లాలనుంచి సభ్యులు పాల్గొని సలహా సూచనలు చేశారు. వార్షిక మహాసభలో సంఘం సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నందమూరి హరికృష్ణ (జయంతి)



నందమూరి హరికృష్ణ 1956 సెప్టెంబరు 2న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించారు. రాజకీయ నాయకుడిగా ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా, మంత్రిగా వ్యవహరించారు. తండ్రి రామారావు తెలుగు దేశం పార్టీ ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలో పర్యటించే వేళ చైతన్యరథానికి సారథ్యం వహించారు. తొలినాళ్లలో సినిమాల్లో నటించినా తర్వాత తండ్రితో రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. శ్రీరాములయ్య, శివరామరాజు, సీతయ్య, లాహిరి లాహిరి లాహిరి తదితర సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. ఉత్తమ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. 2018 ఆగస్టు 29న రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు.

పవన్ కల్యాణ్ (పుట్టినరోజు)



పిఠాపురం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా కొనసాగుతున్న కొణిదెల పవన్ కల్యాణ్ 1971 సెప్టెంబరు 2న బాపట్లలో జన్మించారు. తెలుగు సినీ నటుడు, నిర్మాత, దర్శకుడిగానే కాక జనసేన పార్టీ వ్యవస్థాపకుడు. స్టంట్ కో-ఆర్డినేటర్, ప్లేబ్యాక్ సింగర్, కొరియోగ్రాఫర్‌గా విభిన్నంగా తన ప్రతిభను చాటుకున్నారు. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమాతో తెరంగేట్రం చేశారు. తొలిప్రేమ సినిమాకు ఉత్తమ సినిమాగా జాతీయ ఫిలిం పురస్కారం అందుకుంది. అభిమానులు పవర్‌స్టార్‌గా పిలుస్తారు. సుస్వాగతం, తమ్ముడు, బద్రి, ఖుషి, జల్సా, గబ్బర్‌సింగ్, అత్తారింటికి దారేది, భీమ్లానాయక్ సినిమాలు హిట్‌గా నిలిచాయి. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం కల్గిన అయనకు కరాటేలో బ్లాక్‌బెల్ట్ ఉంది. అన్న చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా ఉన్నా కాలక్రమంలో కాంగ్రెస్‌లో విలీనమైంది. 2014లో సొంతంగా జనసేనను ఏర్పాటు చేశారు. కామన్‌మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ అనే ట్రస్టు సామాజికసేవా కార్యక్రమాలు అందిస్తున్నారు.

వైభవంగా అంజన్న రథోత్సవం


జనసందోహం మధ్య స్వామివారి రథోత్సవం

బొమ్మనహళ్, సెప్టెంబరు 1: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా శ్రావణమాసంలో ఆదివారం ఉదయం ఉత్సవం, రథోత్సవం జరిపిస్తారు. వేకువజామున స్వామివారి ఉత్సవాన్ని భారీ జనసందోహం మధ్య నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పూజలు జరిపారు. అనంతరం రథాన్ని లాగారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం, సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యుం ఆదివారం ఒక ప్రకటనలో తెఇపారు. ఈ జాబ్ మేళాను ఆరు కంపెనీల కోసం నిర్వహిస్తున్నామన్నారు. కావున పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలలోపుఉన్న వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలు, హైదరాబాద్, బెంగుళూర్ ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు.

కారు అపహరణ కేసులో ఇద్దరి అరెస్టు: సీఐ

ముదిగుబ్బ, సెప్టెంబరు 1: కారును అపహరించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివారాలు ఇలా వెల్లడించారు. మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ వీధిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆగస్టు 24వ తేదీ రాత్రి వేల్పుల విజయసింహ తనకు చెందిన ఏపీ39- ఎంఎఫ్- 6263 నెంబరు గల మారుతీ ఎర్టిగా వీఎక్స్ఐ కారును తన ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తులు దానిని అపహరించారని, కారు యజమాని విజయసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ రత్న, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు, ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ యతీంద్ర దర్యాప్తులో భాగంగా నేర స్థలా న్ని పరిశీలించారు. అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. సీఐకి శనివారం సాయంత్రం వచ్చిన సమాచారం మేరకు, ముదిగుబ్బ శివారులోని దొరిగల్లు రోడ్డు పై ఓవర్ సర్కిల్ వద్ద దొంగిలించిన కారుతో పాటు మండల కేంద్రానికి చెందిన షేక్ బాబ్జాన్, కొలిమి సురేష్‌ను అరెస్ట్ చేసి విచారించారు. ఆ కారును బెంగళూరుకు తీసుకెళ్లి ఎవరికైనా అమ్మి డబ్బు సంపాదించాలని దొంగలించినట్లు నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

విద్యుత్ పరికరాల చోరీ

గార్లదిన్నె, సెప్టెంబరు 1: మండలంలోని గార్లదిన్నె, బూదేడు గ్రామాలలో ఉన్న వ్యవసాయ తోటల్లో విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. బూదేడు గ్రామానికి చెందిన రామాంజనేయులు, గార్లదిన్నెకు చెందిన రైతు నల్లప్ప వ్యవసాయ తోటల్లో బోర్లకు అమర్చిన విద్యుత్ స్టార్టర్ పెట్టెలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం రైతులు తోటల వద్దకు వెళ్లి చూడగా పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

ప్రజలకు సౌలభ్యాలు కల్పించడమే సంకల్పం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి

మహదేవపుర, సెప్టెంబరు 1: నియోజకవర్గ ప్రజలకు సౌలభ్యాలు కల్పించడమే తన సంకల్పమని మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజక వర్గంలోని దొడ్డనెక్కుంది, మారతహళ్ళి, వర్తూరు వార్డులలోని ప్రముఖ రహదారుల సమగ్ర అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి మాట్లాడారు. విశాలమైన రోడ్లు, ఫుట్‌పాత్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మురుగుకాల్వలను నిర్మించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. దొడ్డనెక్కుంది మెయిన్‌రోడ్డు సమగ్ర అభివృద్ధి, మారతహళ్ళి నుంచి ఇబ్బలూరు జంక్షన్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు, గుంజూరు నుంచి కృపానిధి కళాశాలకు వెళ్లే రోడ్డు, గుంజూరు పాళ్య నుంచి పణత్తూరు దిణ్ణెకు వెళ్లే రోడ్డు అభివృద్ధి చేయ డానికి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్య క్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రమేశ్, శ్రీధర్‌రెడ్డి, ప్రముఖులు మిథు న్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, ఎంజి జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేషపూజలు


సింధూర అలంకరణలో ఆంజనేయుడు

చేళూరు, సెప్టెంబరు 1: శ్రావణమాసం చివరి శని, ఆదివారాలను పురస్కరించుకుని తాలూకాలోని అంజ నేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సాధారణ రోజులతో పోలిస్తే భక్తుల సందడి కాస్త అధికంగానే కనిపించింది. స్వామివార్లకు అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దొమ్మసంద్రలో జన్మాష్టమి వేడుకలు


రాధాకృష్ణులకు పూజలు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 1: సోంపుర గేట్‌లోని రాయల్ గ్రాండ్ ప్యాలెస్‌లో ఇస్కాన్ దొమ్మసంద్ర ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం 8 గంటలనుంచి రాత్రి 10వరకు వేలాది మంది భక్తులు రాధాకృష్ణులను దర్శించుకుని పునీతులయ్యారు. భగవద్గీత బోధన, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే అంటూ భక్తుల నినాదాలు మారుమోగాయి. ఇస్కాన్ గ్రుస్తు ఆధ్వర్యంలో సుమారు 8వేల మందికి భోజన వ్యవస్థ కల్పించారు. ఇస్కాన్ దొమ్మసంద్ర ఉపాధ్యక్షుడు కమలేశ్ ప్రభు మాట్లాడుతూ అక్షయపాత్ర ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు అన్నప్రసాదం అందచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ దొమ్మసంద్ర అధ్యక్షుడు వేణుమాధవ ప్రభు, ఎమ్మెల్సీ రామోజిగౌడ, యమరె గ్రామపంచాయతీ సభ్యులు పునీత్ పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 1: పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. టీ 20 పోటీల్లో ఎల్‌బీటీ జట్టుపై ఆర్డీటీ కోచింగ్ క్యాంప్ జట్టు ఆరు పరుగుల తేడాతో విజయం సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యా టింగ్ చేసిన క్యాంప్ జట్టు 20 ఓవర్లలో 120 పరుగులు చేసింది. జట్టులోని సాయిప్రణీత్ 60, సాకీబ్ 55, మిశ్రేయ్ 25 పరుగులతో రాణించారు. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎల్‌బీటీ జట్టు 174 పరుగులకు ఆల్ అవుట్ అయింద ని నజీర్ తెలిపారు. విజయం సాధించిన జట్టును సీనియర్ క్రీడకారులు షామీర్, కరుణ, మహి తదితరులు అభినందించారు.